జనగామలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

ఎమ్మెల్యే పల్లా అరెస్టుపై నిరసన వెల్లువ

జనగామలో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

జనగామ, జూలై 1 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. ఉద్యోగ నియామకాలు చేప ట్టాలని దీక్ష చేస్తున్న విద్యార్థి సంఘం నాయకుడిని పరామర్శించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే పల్లాను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడాన్ని బీఆర్ఎస్ నాయ కులు నిరసించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, పేర్ని స్వరూప, దయాకర్, దేవరాయి నాగరాజు, పాండు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి, నాయకులు రావెల రవి, జూకంటి శ్రీశైలం పాల్గొన్నారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి కల్పించాలి

వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నరేశ్‌కుమార్

మంత్రి శ్రీధర్‌బాబుతో వాస్విక్ గ్రూప్ చైర్మన్ నరేశ్‌కుమార్

బచ్చన్నపేట, జూలై 1 : యువతకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన కేటాయించాలని వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. నరేశ్‌కుమార్ మాట్లాడుతూ జనగామ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాబావం వ్యక్తం చేశారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు నరేశ్‌కుమార్ తెలిపారు. అనంతరం వాస్విక్ ఫౌండుషన్ సేవా కార్యక్రమాలను మంత్రికి వివరించగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత బండ్ల గణేశ్ పాల్గొన్నారు.

బుర్ర అపర్ణకు పీహెచ్‌డీ పట్టా

బుర్ర అపర్ణ

జనగామ రూరల్, జూలై 1 : మండలంలోని ఓబుల్‌కేశ్వాపూర్‌కు చెందిన బుర్ర అపర్ణకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రకటించింది. ప్రొఫెసర్ డీ కలీం అహ్మద్ జలీల్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు పీహెచ్‌డీని అందించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ సోమవారం తెలిపారు. అపర్ణ పదో తరగతి వరకు ఓబుల్‌కేశ్వాపూర్‌లో, ఇంటర్‌ను జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో, డిగ్రీని ఏకశిల డిగ్రీ కలశాలలో పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని నిజాం క శాలలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో అపర్ణ పరిశోధన చేయగా పీహెచ్‌డీ పట్టాకు ఎంపికవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని వారు ఆకాంక్షించారు.

మహ్మద్ అబ్దుల్ మొయిజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సమాజంలో వైద్యవృత్తి ఎంతో పవిత్రమైంది

జనగామ, జూలై 1 (నమస్తే తెలంగాణ) : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్యుడు దైవంతో సమానమని తెలంగాణ మైనారిటీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అంకుషావలి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇండో అమెరికన్ హాస్పిటల్ మలక్‌పేట సీఈవో మహ్మద్ అబ్దుల్ మొయిజ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. అంకుషావలి మాట్లాడుతూ మొయిజ్ ప్రతి నెల చివరి ఆదివారం జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డలో ఉచితంగా వైద్యసేవలందిస్తున్నారన్నారు. సమాజ సేవలో డాక్టర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. వైద్యులను, సిబ్బందిని అందరూ గౌరవించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహ్మద్ సమద్, టీఎస్‌మెసా నాయకులు మహ్మద్ మతీన్ ఆతర్, మహ్మద్ జలీల్, హఫీజ్, అర్షద్, రోషన్, డాక్టర్ రహీం రమీష్, ఎండీ అలీం, అజ్మత్‌ఖాన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

తూతూమంత్రంగా 'రైతుభరోసా'..

- అవగాహన సదస్సులకు అంతంతమాత్రంగా రైతులు
- పంట సాయంపై సర్కారుకు అన్నదాతల సూచనలు

చీటకోడూరులో రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నర్మెటలో మాట్లాడుతున్న డీసీవో రాజేందర్‌రెడ్డి

జనగామ రూరల్, జూలై 1 : రైతుభరోసా పథకంలో పంట సాయం అందించేందుకు రైతుల అభిప్రాయాల సేకరణ పేరిట మండలాల్లో ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సులు తూతూమంత్రంగా సాగుతున్నాయి. సోమవారం మండలంలోని పలు రైతువేదికల్లో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి సదస్సులు నిర్వహించారు. అయితే వీటికి రైతులు తక్కువ మంది వస్తుండడం చర్చనీయాంశమైంది. మండలంలోని చీటాకోడూరు, పెంబర్తి రైతువేదికల్లో నిర్వహించిన సదస్సులకు కొద్ది మంది రైతులే వచ్చినా వారి నుంచి అధికారులు అభిప్రాయాలు తీసుకున్నారు. రైతుభరోసా పథకాన్ని ఐదెకరాలకే పరిమితం చేయాలని కొందరు సూచించగా, 10 ఎకరాలకు పంట సాయం ఇవ్వాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. చీటకోడూరు క్లస్టర్ రైతువేదికలో నిర్వహించిన సదస్సుకు జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. సదస్సుకు కేవలం 20 నుంచి 25 మంది రైతులు మాత్రమే రాగా, వారి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ని ఎకరాలకు రైతుభరోసా అమలు చేయాలనే విషయమై రైతుల అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, వేణుగోపాల్, ప్రియాంక, సీఈవోలు భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, ఏఈవోలు సౌమ్య, కమల, ప్రవళిక, మంజుల, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట : మండల కేంద్రంలోని రైతువేదికలో డీసీసీబీ డైరెక్టర్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన రైతుభరోసాపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీవో రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపుతామన్నారు. కొందరు రైతులు ఐదు ఎకరాల వరకు పంట సాయం అందించాలని కోరగా, మరికొందరు 10 ఎకరాల వరకు ఇవ్వొచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏవో సంతోషి, పీఏసీఎస్ సీఈవో వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ భూక్యా జూంలాల్, పీఏసీఎస్ డైరెక్టర్లు నాగపురి కిషన్, ఏఈవోలు అనిత, కన్నయ్య, సొసైటీ సిబ్బంది మల్లయ్య, కేశవులు, శివ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : ఐదు నుంచి పదెకరాలలోపు వరి సాగు చేసే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని రైతులు అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్ ఆధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కౌలు రైతులకు సైతం పథకం వర్తింప చేయాలని కోరారు. వెంచర్లు, ఫామ్‌హౌస్ భూములు, గుట్టలు, తోటలకు పంట సాయం ఇవ్వొద్దన్నారు. ఈ సమావేశంలో 114 మంది రైతులు పాల్గొనగా వీరిలో ఐదు ఎకరాలకే రైతుభరోసా ఇవ్వాలని 67 మంది సూచించారు. 10 ఎకరాలకు ఇవ్వాలని 39 మంది తెలిపారు. పొలం సాగు చేసిన వారికే భరోసా అందించాలని ఎనిమిది మంది రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బావండ్ల నాగజ్యోతీకృష్ణంరాజు, ఏవో విద్యాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు దాసారం శ్రీనివాస్, వేముల లక్ష్మణ్, ప్రభాకర్, రాములు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు నిడిగొండ శ్రీనివాస్, సీఈవో కాశ బాలస్వామి, ఏఈవోలు భాగ్యలక్ష్మి, జయరాజ్, హరిక, విగ్నేశ్వరి పాల్గొన్నారు.

జనగామ ఏసీపీ అంకిత్‌కుమార్ బదిలీ

జనగామ చౌరస్తా, జూలై 1 : రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా జనగామ ఏసీపీ అంకిత్‌కుమార్ శంక్వార్ భద్రాచలం ఏఎస్పీగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఈ మేరకు జీఏడీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ ఏసీపీగా ఇంకా ఎవరికీ బాధ్యతలు అప్పగించ లేదని విశ్వసనీయ సమాచారం.

చిల్పూరులో మాట్లాడుతున్న ఎంపీపీ సరితాబాలరాజు

రూ.1.50 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి : ఎంపీపీ

చిల్పూరు, జూలై 1 : మండలంలోని ఆయా గ్రామాలకు రూ.1,52,35,510 నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు చేసినట్లు ఎంపీపీ బొమ్మిశెట్టి సరితాబాలరాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీటీసీలతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ నిధులతో ఎంపీటీసీలకు ఆయా గ్రామాల వారీగా నిధులు కేటాయించినట్లు సరితాబాలరాజ తెలిపారు. ఒక్కో ఎంపీటీసీకి రూ. 8.31 లక్షల చొప్పున మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూక్యా సరితానర్సింహులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కనుకంటి రవీందర్, ఎంపీటీసీలు తాళ్లపల్లి ఉమా సమ్మయ్య, పాశం శిరీషసురేశ్‌కుమార్, సాదం నర్సింహులు, మునిపెల్లి సుధాకర్, మారబోయిన ఐల్లమ్మఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 1: మండల కేంద్రం శివారు పల్లగుట్ట క్రాస్ రోడ్ వద్ద బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం స్థానిక దళిత కాలనీకి చెందిన ఎడ్ల జాన్ టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై చిన్నపెండ్యాల నుంచి వస్తుండగా పల్లగుట్ట క్రాస్ రోడ్ వద్ద దేశాయి తండా నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో జాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మాచర్ల భిక్షపతిని సన్మానిస్తున్న అధ్యాపకులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

సాటి మనుషులకు ప్రాణం పోసే దేవుళ్లు డాక్టర్లు

'డాక్టర్స్ డే' వేడుకల్లో వక్తలు

జనగామ చౌరస్తా, జూలై 1 : అనారోగ్యంతోపాటు ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడే దేవుళ్లు డాక్టర్లని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం 'డాక్టర్స్ డే' వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు, లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం ఆధ్వర్యంలో రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, డాక్టర్లు గౌతమ్‌రెడ్డి, అంజిరెడ్డి, తనూజ, మౌనికను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సాటి మనుషులకు ప్రాణం పోసే దేవుళ్లు వైద్యులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం ప్రతినిధులు రంగరాజు ప్రవీణ్ కుమార్, గాదె నర్సింహులు, వేణుగోపాల్‌రెడ్డి, బండ భిక్షపతి, నర్సిరెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, నరేందర్, పూర్ణ చందర్, సుమన్, మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ బాబు, వెంకటేశ్వర్లు, మధు, సుమంత్, లక్ష్మయ్య, సోమేశ్వరాచారి, నజియా సుల్తానా, పావని, సల్మాన్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అంబటి కిషన్‌రాజు ఆధ్వర్యంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మౌనిక ఆధ్వర్యంలో దవాఖానలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది వైద్యులతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌కుమార్, సీహెచ్‌సీ సూపరింటెం డెంట్ శంకర్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడే వైద్యుల సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి మామిడాల వెంకటేశ్వర్లు, గోలి శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జనార్దన్, డాక్టర్లు సంధ్య, జయశ్రీ, సంధ్యారాణి, సుమన్, ప్రసన్నకృష్ణ, అజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి : కడియం

ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, జూలై 1 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, రాజకీయంగా తనకు ఎంతో అండగా నిలిచిన ప్రజలకు సేవలందిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తిడుగు శ్రీభవానిశంకర ఆలయంలో సోమవారం నిర్వహించిన మహ చండీ హోమానికి ఆయన ముఖ్యఅతిథి హాజరై పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాత బజ్జూరి కృష్ణమూర్తి, పద్మ దంపతుల ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ మహాశివుడి అనుగ్రహం, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా తాను, వరంగల్ ఎంపీగా నా కూతురు కడియం కావ్య ఘన విజయం సాధించామన్నారు. మా కుటుంబాన్ని ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. వచ్చే నాలుగేళ్లలో చిత్తశుద్ధితో, నిజాయితీగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గర్మిళ్లపల్లి నుంచి తిడుగు, సాగరం మీదుగా జఫర్‌గఢ్ మెయిన్‌రోడ్డు అధ్వానంగా ఉందని, వచ్చే ఆరు నెలల్లో డబుల్ రోడ్డుగా మారుస్తానని ఆయన తెలిపారు. తిడుగులో ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడ్లు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్, ఎంపీటీసీ మాదారపు రజిత బాషా, మాజీ సర్పంచ్ స్వప్న భాస్కర్, నల్లతీగల మణెమ్మ బాషా, అంకేశ్వరు హరిప్రసాద్, శ్రీరాముల నవీన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ కట్టా మనోజ్‌రెడ్డి, నాయకులు బానోత్ రాజేశ్‌నాయక్,, మంచాల ఎల్లయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, నాయకులు పెద్దిరెడ్డి, కృష్ణమూర్తి, గోపు సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

సమ్మయ్యను సన్మానిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

గడ్డం సమ్మయ్యకు ఘన సన్మానం

దేవరుప్పుల, జూలై 1: ఇటీవల కేంద్రం ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు అందుకున్న చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్వినీరెడ్డి ఘనంగా సత్కరించారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో సోమవారం రాత్రి నిర్వహించిన సన్మాన సభకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలతోపాటు సాంస్కృతిక వాఖ సంచాలకులు మామడి హరికృష్ణ హాజరయ్యారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ మట్టి నుంచి పుట్టిన ఆణిముత్యం గడ్డం సమ్మయ్య అన్నారు. కళనే దైవంగా భావించి గ్రామీణ ప్రాంతాల్లో అంతరించి పోతున్న జానపద కళలను పోషిస్తున్న గడ్డం సమ్మయ్య అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ గడ్డం మోహన్‌రావు, అతిధులు చక్రాల కిషన్, కందగట్ల సత్తయ్య, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గడ్డం వెంకన్న, సీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక గజవెల్లి గణపతి, ఉస్మాన్‌బిస్మిల్లా ఖాన్ జాతీయ పురస్కార గ్రహీత ఒగ్గు రవి, అందె భాస్కర్ పాల్గొన్నారు.

తాటిపత్రీలు అందిస్తున్న సుధీర్‌రెడ్డి

నిరుపేద కుటుంబానికి చేయూత

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 1 : మండలంలోని తాటికొండకు చెందిన నిరుపేద ఇంటి పైకప్పుకు వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి తాటిపత్రీలను అందించారు. సోమవారం గ్రామంలోని 10 వార్డులో సయ్యద్ రబ్బాని ఇంటి పైకప్పు సరిగా లేకపోవడంతో వర్షం కురిస్తే నీరు చేరుతున్నది. కుటుంబ సభ్యులు తల దాచుకోవడానికి వీలు లేకుండా నానా ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ సాయం చేశారు. సుమారు రూ.10 వేల విలువైన తాటిపత్రీలను అందించారు. ఈ కార్యక్రమంలో కుసుమ రమేశ్, మల్లేశం, అక్కనపల్లి బుచ్చయ్య, పులిగిల్ల రాజు, సబ్బర్, తాటికొండ సంపత్, బలిజ రాజు తదితరులు పాల్గొన్నారు.

భుజేందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

కవి మాన్యపు భుజేందర్‌కు సన్మానం

పాలకుర్తి, జూలై 1: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సూర్యాపేటలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో మండలంలోని బమ్మెరకు చెందిన కవి, కళాకారుడు మాన్యపు భుజేందర్‌ను సత్కరించారు. రాష్ట్ర, జాతీయ, స్థాయిలో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్న శ్రీశ్రీ కళావేదికలో పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా భుజేందర్ మాట్లాడుతూ కవి సమ్మేళనంలో కవితా పఠనం చేశానని తెలిపారు. అనంతరం సాహితీవేత్తలను సత్కరించారని వివరించారు. కవి సమ్మేళనంలో కేంద్ర సాహిత్య అకాడమీ సలహాదారు నాళేశ్వరం శంకరం, అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావత్, ఈశ్వరి భూషణం, చిట్టి లలిత, సంస్థ జిల్లా అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఎంపీటీసీ ఆత్మహత్య



బండ లక్ష్మి (ఫైల్)

జనగామ రూరల్, జూలై 1 : ఇబ్బందులు తట్టుకోలేక మానసిక వేదనతో మహిళా ఎంపీటీసీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఎల్లంలలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంలకు చెందిన బండ లక్ష్మి(43), వెంకటేశం దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ప్రస్తుతం లక్ష్మి ఎల్లంల–సిద్దెంకి ఎంపీటీసీగా సేవలందిస్తున్నారు. గతంలో ఆమె భర్త వెంకటేశం సర్పంచ్‌గా కొనసాగారు. కూతుళ్ల వివాహాలు, భూమి కొనుగోలుకు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో కొద్ది రోజులుగా లక్ష్మి, వెంకటేశం మానసికంగా ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో లక్ష్మి ఆదివారం సాయంత్రం ఇంట్లోనే ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అదే రాత్రి 10 గంటలకు లక్ష్మి మృతి చెందింది. మృతురాలి తమ్ముడు బుడిగె సిద్దులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్వేత తెలిపారు.

పలువురు ప్రజాప్రతినిధుల నివాళులు

ఎంపీటీసీ బండ లక్ష్మి మృతి విషయం తెలుసుకున్న మండల ప్రజాప్రతినిధులు ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఎంపీపీ మేకల కళింగరాజు, మాజీ మార్కెట్ చైర్మన్లు గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బాల్దె సిద్ధిలింగం, నాయకులు జనగాం వీరేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఎర్ర సుజాత, అంబాల ఆంజనేయులు గౌడ్, ముల రవి గౌడ్, ఎర్రమల స్వర్ణలత, సుంకరి నిర్మల, ఏళ్ల సుజాత, పీఏసీఎస్ డైరెక్టర్లు మడిపల్లి సుధాకర్ గౌడ్, సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మల్లయ్య, కరుణాకర్ తదితరులు పరామర్శించారు.

సీసీ కెమెరా పుటేజీలో జ్యువెల్లరీ షాపులో మహిళలు

జ్యువెల్లరీ షాపులో చోరీ

పాలకుర్తి, జూలై 1: జ్యువెల్లరీ షాపులో మహిళలు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం మండల కేంద్రంలో వెలుగు చూసింది. స్థానిక రజినీకర్ జ్యువెల్లరీ షాపులో ఆభరణాలు కొనుగోలు చేసేందుకు నలుగురు మహిళలు షాపునకు వచ్చారు. షాపు యజమాని శ్రీపాద రజనీకర్ వెండి ఆభరణాలు చూపిస్తుండగా నాలుగు వస్తువులు చోరీ చేశారు. అనంతరం రజనీకర్ సీసీ కెమెరాల్లో చెక్ చేయగా మహిళలు ఆభరణాలను చోరీ చేసి తీసుకెళ్లడం కనిపించింది. ఇంతలోనే వారు పరార్ కావడంతో రజినీకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- 'ప్రజావాణి'లో అధికారులకు ఆదేశం

అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, జూలై 1 : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజావాణి'లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి ప్రజల నుంచి 92 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. తరిగొప్పుల మండలం నర్సింహులపురానికి చెందిన మునిగంటి కేదారి తనకు వారసత్వంగా రావాల్సిన భూమిని సవతి తల్లి అక్రమంగా పట్టా చేసుకుందని ఆరోపించారు. దీనిని ఇతరులకు విక్రయించేందుకు యత్నిస్తున్నందున న్యాయం చేయాలని కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. నర్మెట మండల కేంద్రానికి చెందిన ఏదునూరి తేజస్వీకి చిన్నప్పటి నుంచి మాటలు రావడం లేదని, చెవులు వినపడడం లేదని బాలిక తల్లి రాజేశ్వరి కలెక్టర్‌కు వివరించారు. దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని ఆమె కోరారు. చిల్పూరు మండలం మల్కాపూర్‌కు చెందిన దివ్యాంగుడు భాగం యాదగిరి తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బచ్చన్నపేట మండలం చిన్నరాంచర్లకు చెందిన ఆరు కుటుంబాలకు గత ప్రభుత్వం గోపాల్‌నగర్ శివారులోని సర్వే నంబర్ 174లో ఇచ్చిన తొమ్మిదెకరాల అసైన్డ్ భూమిలో కొందరు అక్రమంగా గుడిసెలు వేశారని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషాకు అర్జీ సమర్పించారు. లింగాల ఘనపురం మండలం కొత్తపల్లికి చెందిన ఆరె కొమురయ్య తన తండ్రి నుంచి వారసత్వంగా రావాల్సిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని తనకు దక్కకుండా అన్న ఉప్పలయ్య ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కలెక్టర్‌కు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో కళా, సాహిత్య, ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణకు ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించాలని కవులు, కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత చేప పిల్లల పథకానికి బదులుగా సొసైటీలకు నగదు బదిలీ జమ చేయాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేశ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సుమారు లక్ష జనాభా కలిగిన గిరిజనులకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అంతకు ముందు క్యాంపు కార్యాలయంలో జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న గత ప్రజావాణి దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. తమ పరిధిలో ఉన్న భూ సమస్యల్నీ వెంటనే విచారణ జరిపి పరిష్కరిస్తామని, కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలపై బాధితులు కోర్టుకు వెళ్లి మాత్రమే సమస్య పరిష్కరించుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు.

'క్యూ' పాటించడం లేదని అర్జీదారుల ఆగ్రహం

కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన 'ప్రజావాణి'లో ఎవరూ 'క్యూ' పాటించడం లేదని, సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు అర్జీదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జోక్యం చేసుకున్న పోలీసులు అర్జీదారులను వరుస క్రమంలో పంపించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) సుహాసిని, డీఈవో కే రాము, సివిల్ సప్లై అధికారి రోజారాణి, హార్టికల్చర్ ఆఫీసర్ కేఆర్ లత, మత్స్యశాఖ అధికారి నాగులు, ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి దయానంద రాణి, బీసీ అభివృద్ధిశాఖ అధికారి బీ రవీందర్, కలెక్టరేట్ ఏవో రవిందర్, ఈడీఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోయిన అధికారులు

స్మార్ట్‌ఫోన్లు చూస్తున్న అధికారులు

జనగామ చౌరస్తా, జూలై 1 : 'ప్రజావాణి' కార్యక్రమంలో తమ సమస్యలు తెలిపేందుకు సోమవారం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలిరాగా, మరోవైపు కొందరు అధికారులు నిబంధనలు పాటించకుండా స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోవడం చర్చనీయాంశమైంది. తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తే, పరిశీలించి పరిష్కరించాల్సిన అధికారుల్లో కొందరు సెల్‌ఫోన్లలో సోషల్ మీడియాలో వచ్చే వీడియో క్లిప్పింగ్స్‌ను వీక్షించేందుకు పరిమితమయ్యారు. ప్రజా సమస్యలను మరిచిన నిర్లక్ష్యపు అధికారులపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని పలువురు అర్జీదారులు జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.